# ఈ సమరం సాగిస్తాను

'వాచస్పతి'



సాయంత్రం ఆరుగంటలయింది. వేసవి కాలం కావడంవల్ల వెలుగు చీకటిని ఇంకా దగ్గరకు రానివ్వలేదు. పశ్చిమ దిక్కాంత తీరికలేక హడావుడిగా ముఖాన పెట్టుకున్న ఎర్రని కుంకుమలా ఉంది.

పగటిపూట సూర్యునివేడిమికి వేడెక్కిన గాలి బాగా చల్లబడి, అలసిన శరీరాలకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. అరవింద వరండా లోకి వచ్చి వీధిచివరివరకూ చూపులు బరపి చూసింది.

వీధి వచ్చేపోయేవారితో రద్దీగా ఉన్నా తను ఎదురు చూస్తున్న వ్యక్తిజాడ కనిపించనందుకు నిరుత్సాహం ఆమెను ఆవరించింది. మెల్లగా అడుగులో అడుగు వేస్తూ తిరిగి లోపలికి వచ్చి కుర్చీలో జార్లబడింది.

పొడవాటి జడలో అందంగా అమర్చు కున్న మల్లెపూల మాలలోని పువ్వులు అప్పుడప్పుడే విచ్చుకుంటూ సౌరభాన్ని గదంతా విరజిమ్ముతున్నాయి.

రెండు నిముషాలలా కూర్చుందో లేదో, తిరిగి వరండాలోకి వెళ్ళాలన్న కోరిక కలిగింది !

తన ఆత్రుతకు లోలోపలే నవ్వుకుంది. కిటికీ దగ్గరగా వెళ్ళి రోడ్డులోకి చూసింది. ఉహూ...ఫలితం శూన్యం.

కిటికీ కర్టెను సర్దింది. తర్వాత రేడియోముందు కూర్చుని మందస్థాయిలో ట్యూన్ చేసింది.

'అబ్బ. ఈమె గొంతులో వీణ అమర్చాడా, దేవుడు !' అని ఆకంఠ మాధుర్యానికి ఆశ్చర్యపోయింది. రోజుకు కనీసం రెండుసార్లయినా, ఆమె కంఠ మాధుర్యాన్ని మెచ్చుకోకుండా ఉండలేదు అరవింద. కానీ, ప్రస్తుతం పాటమీద ఆమె మనసు నిలుపలేక పోతుంది. తన ప్రమేయం లేకుండానే ఆలోచనలు సాగిపోతున్నాయి. నిన్న ననగా వస్తానన్న వారు, ఇంతవరకూ రానందుకు కారణ మేమిటో ?

ఏదన్నా అత్యవసరమైన పని ఉండి ఆగిపోవలసి వచ్చిందా ? లేక అక్కడికి వెళ్ళాక ఏదన్నా జబ్బు చేసిందా ? లేక దారి మధ్యలో ఏదన్నా ప్రమాదం సంభవించిందా ? చివరి ఆలోచన ఆమె కేమాత్రం నచ్చలేదు. దాన్ని వెంటనే కొట్టి పారవేసింది.

పై రెండింటిలో ఏదో ఒకటి జరిగి ఉంటుందని తన్నుతాను సమాధాన పరచుకుంది.

అయినా, ఇక్కడ తనొక్కతే ఉంటుందని తెలుసు కదా ! ఒంటరిగా ఉండడం తనకెంత భయమో కూడా వారికి బాగా తెలుసు. తెలిసి రాలేక పోయారంటే, కారణం బలీయమైనదే అనిపిస్తుంది.

ఏవిటబ్బా ఆకారణం?

బుగ్గన వేలుంచుకుని తీవ్రాలోచనలో

మునిగిపోయింది.

గేటు కిర్రుమన్న శబ్దం అయింది.

ఒక్క ఉదుటున వరండాలోకి వచ్చింది. గాలికి కదలిన గేటు ఆమెనుచూసి పరిహసించింది.

నిరాశతో తిరిగి లోపలికివెళ్ళి యధాస్థానంలో కూర్చుంది.

ఏం చేసేందుకు తోచలేదు. ఏవేవో ఆలోచనలూ అర్థంలేని ఆందోళనలూ ఆమె మనశ్శాంతిని దోచుకుంటున్నాయి.

టీపాయ్ మీదున్న పత్రికతీసి పేజీలు త్రిప్పసాగింది.

సాయంత్రం నుండి సీరియల్స్ చదువుదామని ఎంత ప్రయత్నించినా, మనసు వాటిమీద లగ్నం చేయలేక పోతుంది.

అలాగే చేతిలో పుస్తకం పట్టుకుని, అర్థరహితమైన చూపులతో ముఖచిత్రం వేపు చూస్తూ కూర్చుంది.

ఈసారి బూట్లశబ్దం స్పష్టంగా వినిపించింది.

భయాలనూ, ఆందోళనలనూ విసురుగా ప్రక్కకునెట్టి, సంతోషం ముందుకు వచ్చి మందహాసం చేసింది.

చేతిలోఉన్న పుస్తకం టీపాయ్‌మీద పడేసి లేచి నిలుచుంది, ప్రకాశం కర్టెను తొలగించుకుని లోపలకు వచ్చాడు.

భర్తను చూడగానే అరవింద ముఖం ఆనందంతో ప్రఫుల్ల పంకజమే అయింది.

కళ్ళు మిలమిల మెరిసాయి.

చేతిలో ఉన్న హాండ్‌బ్యాంగ్ విసురుగా వోమూల పడేసి, విసవిసా బాత్‌రూంవేపు నడచాడు ప్రకాశం.

తనవేపు ఒకేసారయినా చూడకుండా, ఒక మాటయినా లేకుండా భర్త అలా వెళ్ళడం, అంతులేని ఆశ్చర్యాన్ని కలిగించింది అరవిందకు. మనసు చివుక్కుమంది.

'ప్రయాణంలో అలసిపోయారు కాబోలు' అనుకుని సేద తీరేందుకు చల్లని పానీయం తెచ్చే ఉద్దేశంతో వంటగదివేపు నడచింది.

ఐదు నిముషాలయ్యాక ప్రకాశం హాల్లోకివచ్చి, సోఫాలో కూర్చుని బూట్ల లేసులు విప్పకోసాగాడు.

గ్లాసునిండా ఫ్రూట్‌జూస్ తెచ్చిన అరవింద, భర్తముఖంలో తీక్షతకు అదిరిపడింది.

అప్పటికీ ఒక పలకరింపుమాట లేకపోయేసరికి కన్నీళ్ళ పర్యంతమైంది.

'జ్యూస్ తీసుకోండి!' అంటూ తనే పలకరించింది.

విసురుగా తలెత్తి కోపంగా భార్య ముఖంలోకి చూసి, తిరిగి తలవంచుకుని బూట్ల లేసులు విప్పకోసాగాడు.

అర్థంలేని ఆ కోపానికి విస్తుపోయింది. హృదయం బాధతో జివ్వుమంది.

ఎక్కడికన్నా వెళ్ళి తిరిగి వచ్చాక ప్రేమగా పలకరించే భర్త అప్పుడంత నిరాదరణ చూపుతున్నందుకు ఆమె హృదయం బాధతో మెలికలు తిరిగిపోయింది.

చెమ్మగిలిన కళ్ళను దాచుకునే ప్రయత్నంలో నేల చూపులు చూస్తూ— 'జ్యూస్, ఇదోండి !' అంది మళ్ళీ.

'అక్కర్లేదు' కటువుగా సమాధానం ఇచ్చాడు.

'ఏం?' అని అడగాలనుకుంది. కానీ భర్తముఖం చూస్తూ ఆ ప్రశ్న వేసే ధైర్యం లేకపోయింది. జ్యూస్ టీపాయ్ మీదుంచి వంటింట్లో ఏం పనిలేకున్నా, వెళ్ళి డైనింగ్‌టేబుల్ ముందున్న కుర్చీలో కూలబడింది. చేతులు రెండూ మడచి టేబిలుమీద పెట్టి ఆ చేతులమీద తల పెట్టుకుని కళ్ళుమూసుకుంది.

భర్త కోపానికి కారణాల తోరణాలను గాలించసాగింది.

అది తన మీద కోపమేనా? లేక ప్రయాణం చేసిన విసుగువల్ల ఎవరిమీది కోపాన్నో తన మీద చూపుతున్నారా?

ఆ విసుగు పోయాక, కోపం తగ్గిపోతుందా? అప్పుడు తనను వెతుక్కుంటూ రారూ? అప్పుడు చెప్పాలి వారిపని— అనుకుని తన ఆలోచనకు బరువుగా నవ్వుకుంది.

అలా పిచ్చిపిచ్చిగా ఆలోచిస్తూ మరో పదినిముషాలు గడిపింది. అలా ఆలోచిస్తున్నా చెవులుమటుకు భర్త పాదాల చప్పుడుకు రిక్కించుకునే ఉన్నాయి.

భర్త పాదాల చప్పుడైతే వినిపించలేదు గాని, అతని కంఠస్వరం మటుకు కటువుగా వినిపించింది.

హడలిపోతో, తనవల్ల ఏ పొరపాటు జరిగిందోనని తడబడే అడుగులతో హాల్లోకి వచ్చింది.

ప్రకాశం బ్యాగ్‌లో ఏదో వస్తువుకొరకు వెదుకుతున్నట్లుంది. అతని ముఖం చికాగ్గా, కోపంగా ఉంది.

ఆ కోపానికి కారణమేమిటో అర్థం కాని అరవింద బరువుగా నిట్టూర్చింది.

'వచ్చారా, అరవిందా దేవిగారూ!' అన్నాడు విసురుగా తలెత్తి ఆమె ముఖంలోకి చూస్తూ.

అరవింద భయంతో కంపించిపోయింది. చూపులు భూదేవిని కౌగలించుకున్నాయి.

'తమరికొరకో బహూమానం తెచ్చాను' అన్నాడు హేళనగా ... తనకొరకో బహూమానం తెస్తే, ఆ విషయం చెప్పేందుకు ఇంత వ్యంగ్యమూ, హేళన అవసరమా?

పెళ్లయిన ఈ సంవత్సరంలో తన కొరకు ఎన్ని కానుకలు తేలేదు! వాటిని ఎంత ప్రేమగా తనకివ్వలేదు? ఈ నాటి ఈ వింతధోరణికి ఎలా భాష్యం చెప్పకోవాలి? లేక తనను ఏడిపించేందుకు శ్రీవారు ఆడుతున్న నాటకంలో ఒకభాగమా ఇది?

అలా ఆలోచిస్తూ తనలో తనే సతమతమైపోసాగింది.

'ఇదో, ఇది కాస్త చూడండి!' అంటూ ఒక కవరు ఆమె చేతికి అందించాడు.

కంపిత హస్తంతో దాన్ని తీసుకుంది.

'తీరిగ్గా కూచుని చదువుకోండి! ఆ ఫోటో ఎవరిది? కాస్త చూడండి!' ముందుకన్నా ఇంకా వ్యంగ్యంగా, హేళనగా అన్నాడు.

అరవింద కవరునుండి వో ఫోటో, ఉత్తరం వెలుపలకు తీసింది. ఆ ఫోటో వేపు చూడగానే నిశ్చేష్ట అయింది.

కాళ్లక్రింద భూమి కదలుతున్నట్లయింది.

తల గిఱ్ఱున తిరగ సాగింది.

కాళ్ళు వణుకుతున్నందువల్ల నిలుచో లేక కుర్చీలో జార్లబడింది.

'అది తమరి ఫోటోయేనా? లేక నేను పొరబడ్డానా?'

ఆ కంఠంలోని హేళన బాకులా ఆమె గుండెను చీల్చి రక్తసిక్తం చేసింది.

కళ్లల్లో గిఱ్ఱున నీరు తిరిగింది. కన్నీటి పొరగుండా ఫోటోవేపు చూసింది.

నాలుగు సంవత్సరాలక్రితం తను పతిలో చదువుకుంటున్నప్పుడు 'శ్రీ

ఒక్సరే ఫోటో స్టుడియోలో తీయించుకున్న ఫోటో అది. ఆ సంవత్సరం పెదనాన్నగారింట ఉండి పి. యూ. సి. చదువుకుంది. తర్వాత ఆర్థికమైన ఇబ్బందులవల్ల చదువుకు స్వస్తి చెప్పవలసి వచ్చింది.

'ఆ ఉత్తరం తమరు వ్రాసిందేనా? మావాడిదగ్గర చాలా ఉన్నాయి. అయితే, మచ్చుకు ఒక్కటే తెచ్చాను!' అన్నాడు.

అగ్నికణాలను కుమ్మరిస్తున్న ఆ కళ్లల్లోకి చూడలేక పోయింది. అతని కోపాగ్నిశిఖలలో తన శరీరమూ, హృదయమూ యావత్తూ దహనమై పోతున్నట్లు విలవిలలాడి పోయింది. మంటల్లో చిక్కుకున్నప్పుడు చేసే ఆర్తనాదనం లాంటిది గుండెనుండి వెలువడ్డా గొంతు పెగుల్చుకుని వెలుపలకు రాలేక పోయింది,

మూగవేదన కన్నుల్లో బరువుగా నిరచుకుంది.

'ఏం చెప్తావు, పాపం! కల్లబొల్లి కథలల్లేందుకు ఎలాంటి అవకాశమూ లేక పోయె! ప్రొద్దుటే మీ పుట్టింటికి వెళ్తావు గాని, ప్రయాణానికి సిద్ధంగా ఉండు!' అని చెప్పులు తొడుక్కుని విసవిసలాడుతూ బయటకు వెళ్లిపోయాడు.

వెర్రిదానిలా వెళ్తున్న అతని వేపు చూస్తున్న అరవింద శిలాప్రతిమే అయింది.

దాదాపు ఐదునిముషాల తర్వాతగానీ, ఆమెలో చలనం కలుగలేదు. కళ్లనుండి 'టప్, టప్' మని కన్నీటి బొట్లు చెక్కిళ్లమీదుగా జారాయి. గుండెనుండి రక్తాన్ని పిండుతున్నట్లు బాధపడింది.

గదిలోకి వెళ్లి, మంచంమీద వాలిపోయి, దిండులో తలదూర్చి వెక్కివెక్కి ఏడ్వసాగింది.

ఓ అర్ధగంట గడచాక తాత్కాలికంగా కాస్త ఉపశమనం కలిగినట్లనిపించింది.

గుండె అంచులను తాకిన విషాదం, కన్నీటిద్వారా కాస్త వెలుపలకు వచ్చింది.

చెక్కిళ్ళమీదుగా, కన్నీటిధారలు ఇంకా ప్రవహిస్తూనే ఉన్నాయి. మనసు నాలుగు సంవత్సరాల వెనక్కు వెళ్లింది.

గతం స్పష్టంగా సినిమా చూస్తున్నట్లుగా, కళ్ళముందు కదలింది.

ఉన్న ఊళ్ళోనే ఎస్. ఎస్. ఎల్. సి. ఉండడంవల్ల ఎస్. ఎస్. ఎల్. సి. పాసయింది. వేరే ఊరిలో హాస్టల్లో పెట్టి చదివించేస్తోమత నాన్నకులేదు. ఇరవైనాలుగ్గంటలు పనిచేసే ఎల్. డి. సి. నాన్న. చుట్టం చూపుగా వచ్చిన పెదనాన్న, కాలేజిలో చేరాలన్న తన ఉత్సాహాన్ని కోరికన్నూ చూసి ఓ సంవత్సరం తమఇంట్లో పెట్టుకుంటా మన్నారు. ఏనుగెక్కినంతగా సంబరపడి పోయింది. పి. యు. సి. చదువుకునేందుకు తిరుపతి వెళ్లింది. పెదనాన్న అప్పర్ ప్రైమరి స్కూల్లో హెడ్‌మాస్టరుగా ఉండేవారు. పెదనాన్నకు ఇద్దరే సంతానం. అన్నయ్య, రాఘవ ఫైనల్ బి. యస్. సీ. లో ఉన్నాడు. నీరజ తన ఈడుదే. ఇద్దరూ పి. యు. సీలో చేరారు.

పెదనాన్నగారింట ఉండగానే వేణుగోపాల్‌తో పరిచయం అయింది. అన్నయ్య క్లాస్‌మేట్, స్నేహితుడు, వేణుగోపాల్. తరచుగా అన్నయ్యకొరకు ఇంటికి వచ్చేవాడు. వాళ్లిద్దరూ హైస్కూల్ నుంచీ స్నేహితులు. దగ్గర బంధువేమో అన్నంత చనువుగా మసలేవాడు. నీరజ వేణన్నయ్య అనేది. తను ఏవరసాపెట్టి పిలిచేదికాదు. తన పనేమిటో తను చూసుకునేది. వాళ్ళు ముగ్గురూ కేరమ్స్‌దగ్గర కూర్చుని, నాలుగోమనిషికొరకు తనను బలవంతంచేసేవారు. వెళ్లక తప్పేదికాదు.

వేణు చాలా సరదామనిషి. తన ఛలోక్తులతో ఇంటిల్లిపాదిని నవ్వించేవాడు. తను మటుకు చాలావరకూ మూతిబిగించే ఉండేది.

ఓ సాయంత్రం కారమ్స్ ఆడుతున్నారు.

ఏదో ఛలోక్తి విసిరాడు వేణు. ఫక్కున నవ్వారు—అన్నయ్యా, నీరజా. తను మటుకు వస్తున్న నవ్వును బలవంతంగా అణచి, పెదవులు బిగించింది.

'అరవిందగారి పలువరస అందంగా, దానిమ్మ గింజల్లా, ఉంటుందనుకున్నాను' అన్నాడు తన ముఖంలోకి ఓరగా చూస్తూ.

'కాదన్న సందేహం ఇప్పుడెందుకు కలిగింది?' అంది నీరజ.

'మరయితే నవ్వరేం? నవ్వితే ఎగుడు దిగుడు పళ్ళు కనిపిస్తాయనేగా ఆమెగారి భయం!' అన్నాడు తనను కవ్విస్తూ. తన కోపం వచ్చింది. మూతి మరీ బిగించింది.

'అలాగెందుకనుకోవాలి; నీ జోక్ బాగాలేదని అనుకోకూడదూ?' అన్నాడు అన్నయ్య సన్నగా నవ్వుతూ.

'అరవిందగారూ; నవ్వకుండా మూతలా బిగిస్తే మీకు మీరే కీడుచేసుకుంటున్నారన్నమాట! నవ్వు టానిక్‌లాంటిది. ఆరోగ్యమే ఒకవిధంగా అందమని చాలామంది, ముఖ్యంగా రేడియో వాళ్ళు చెప్తున్నారీమధ్య! కాబట్టి, అందంగా ఉండాలన్న కోరిక మీకుంటే ఆరోగ్యంగా ఉండేందుకు మొదటి షరతు మనసును ఆరోగ్యంగా ఉంచుకోవడమే! మనసును ఆరోగ్యంగా, నిర్మలంగా ఉంచుకోవడం ఎలాగంటారా? ప్రతిరోజూ నవ్వనే 'టానిక్' ఓ డోసు పుచ్చుకోవాలి! ఊఁ! నవ్వండి!'

ఆ మాటలకు శ్రోతలు ముగ్గురూ ఫక్కున నవ్వారు. అలాగ తను మాట్లాడకున్నా మాట్లాడించి, నవ్వకున్నా నవ్వించి రోజులు జరిగే కొద్దీ తనకు చేరువగా వచ్చాడు వేణు. దూరంగా వెళ్దామన్నా, అతని చూపుల్లోని స్నేహబావం అయస్కాంతంలా ఆకర్షించేది. అతని మాటల్లోని చమత్కారం, తియ్యదనం మంత్రముగ్ధలా బంధించి అతని ముందు పడేసేవి!

ఒక్కరోజు అతను కనిపించకుంటే మనసులో దిగులు దిగులుగా ఉండేది. ఆరోజు దేనిమీదా మనసు నిలవలేకపోయేది.


రోజులు క్షణాల్లా దొర్లిపోయాయి.


తనూ నీరజా పబ్లిక్ పరీక్షలు వ్రాసారు.

ఆ సంవత్సరంలో పెదనాన్న రిటైర్ అవుతారు గనక తనిక వాళ్లింట్లో ఉండి పై చదువులు చదువుకునే అవకాశంలేదు. ఆ విషయం జనవరి సెలవలకు వెళ్ళినప్పుడే అమ్మా నాన్నా చెప్పారు.

వేసవి సెలవలకు ఊరికి వచ్చేరోజు నీరజా, అన్నయ్యా, వేణూ బస్‌స్టాండుకు వచ్చారు.

బస్సుకొరకు ఎదురుచూస్తూ అంతా నిలుచోనున్నప్పుడు 'మీ ఊరెళ్ళి మమ్మల్నంతా మరచి పోకండి, అరవిందగారూ! అప్పుడప్పుడూ గుర్తుకు తెచ్చుకోండి!'




# ఈ సమరం సాగిస్తాను

అన్నాడు వేణు నవ్వుతూ తన కళ్లల్లోకి చూస్తూ.

'నన్ను మరచిపోవద్దు, సుమా !' అన్నట్లు అభ్యర్థిస్తున్నాయి అతని కళ్లు.

కళ్లు వాల్చి మెల్లగా తనలో తనే నవ్వుకుంది.

మనసు ఆనందడోలలో ఉయ్యాలలూగింది.

బస్సు వచ్చింది. బస్సులో ఎక్కి కూర్చున్నాక చివరిసారిగా వేణు కళ్లల్లోకి చూసింది.

ఆ కళ్లల్లో అదే అభ్యర్థన! బహుశా అది తన ఊహేనేమో ? చూపులతోనే వీడ్కోలు తీసుకుంది.

బస్సు కదలింది.

'గుడ్‌బై ఫర్ ది ప్రెజెంట్ !' అన్నాడు గాలిలో చెయ్యి ఊపుతూ వేణు.

బస్సు వేగాన్ని పుంజుకుంది.

సీటునానుకుని, ఆలోచనలో మునిగిపోయింది.

ఆలోచనలన్నీ వేణు చుట్టే పరిభ్రమిస్తున్నాయి.

తనకూ వేణుకూ మధ్య నున్న బంధం కేవలం స్నేహబంధమేనా ? ఈ అనుబంధం శాశ్వత బంధంగా మారే అవకాశం ఉందా ! వేణు కలవారి అబ్బాయి. అతని మీద తల్లిదండ్రులు పెట్టుకున్న ఆశలు గొప్పగానే ఉంటాయి. పైగా అతనెప్పుడూ అలాంటి పిచ్చిపిచ్చి మాటలు తనదగ్గర మాట్లాడలేదు. అలాంటిది తనిలా పునాదులు లేని ఆశాసౌధం నిర్మించడం అవివేకం కదూ ?

ఇది కేవలం స్నేహం.

ఈ స్నేహ సౌరభవాన్ని కొన్నాళ్ళపాటు అనుభవించాలంటే దీనిరూపం మార్చకుండా జాగ్రత్త పడాలి.

సెలవలు అయిపోతూ ఉండగా, వేణు దగ్గరనుండి వచ్చిన ఉత్తరం తనను ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరి చేసింది.

ఆ ఉత్తరాన్ని ఎన్నిసార్లు చదువుకుందో లెక్కేలేదు !

ఆ ఉత్తరంలోని సారాంశం : 'చాలా రోజులనుండీ ఉత్తరం వ్రాయాలని అనుకుంటూనే వ్రాసేందుకు సందేహించాననీ,

తనమీద అభిప్రాయమంటూ ఉంటే తప్పక ప్రత్యుత్తరం యిమ్మనీ, తిరుగు ఉత్తరం అందాక ఎన్నాళ్లనుండో చెప్పాలనుకుని కూడా చెప్పలేక పోయిన విషయాన్ని వ్రాస్తానని వ్రాసాడు.

ఆ ఉత్తరం చదువుకొని సంతోషంతో పొంగి పోయింది. అతను వ్రాస్తానన్న విషయం ఏమిటో ఊహించుకుని, అప్పుడే పిగ్గిల పెళ్లికూతురయింది!

ఎంత పిచ్చితనం!

అమ్మ అడిగింది, జాబు వ్రాసిన దెవరని.

కాలేజీలో తనతోపాటు చదువుకున్న ఆమ్మాయని చప్పన అబద్ధమాడింది.

అమ్మ నమ్మింది! అమాయకురాలు?

నాన్న కెప్పుడూ తన ఆఫీసు గొడవ తప్ప ఇంటి విషయం పట్టదు. నాన్న ఇంట్లో ఉండేకాలం చాలా తక్కువ.

పోస్టు వచ్చేవేళకు సాధారణంగా నాన్న ఇంట్లో ఉండరు. అందుకని తనకు ఉత్తరం వచ్చిన విషయం నాన్నకు తెలీదు. ధైర్యంచేసి వేణు ఉత్తరానికి ప్రత్యుత్తరం వ్రాసింది. అతను తనను తప్పక వివాహం చేసుకుంటాడనే ప్రత్యుత్తరం ఇచ్చింది. ఒకరిమీద ఒకరికి వున్న అభిప్రాయం ఉత్తరాల మూలంగా వెల్లడయ్యాక వాటి రాకపోకల వేగం పుంజుకుంది.

వేణు కోరికమీద తన ఫోటోకూడా పంపింది.

# ఈ సమరం సాగిస్తాను

ఆఫోటోనే ఇది!

దిండులోనుండి తలెత్తి ఫోటోవేపు చూసింది...

ఈఫోటో తనభర్త చేతికెలా వచ్చింది?

కొద్ది క్షణాలపాటు తీవ్రంగా ఆలోచించినా, ఆ ప్రశ్నకు సమాధానం దొరకలేదు.

తిరిగి మనసు గతంలోకి వెళ్లింది.

ఆరు నెలలు నాన్న దృష్టిలో పడకుండా ఉత్తరాలువ్రాస్తూ ఉత్తరాలు అందుకుంది.

అయితే, ఏరోజు తన ఉత్తరం నాన్న చేతిలో పడుతుందోనన్న భయం క్షణ క్షణం మనసును పీడిస్తూనే ఉంది.

ఆరోజు రానేవచ్చింది!

ఆరోజు వంట్లో బాగలేదని సెలవు పెట్టి ఇంట్లోఉన్నారు నాన్న.

వేణు దగ్గరనుండి ఉత్తరం వచ్చింది.

ఆ ఉత్తరం నాన్న తీసుకుని చదివారు.

తను గదిలోకూర్చుని వణికిపోతుంది.

నాన్న అడిగితే ఏం సంజాయిషి ఇవ్వాలి?

వటింట్లోకి వెళ్లి అమ్మకు అసలు విషయంచెప్పి భోరున ఏడ్చేసింది.

నాన్న వంటింటివేపువచ్చి అమ్మద్వారా విషయం తెలుసుకుని మౌనంగా తిరిగి వెళ్లారు.

అప్పటికి పో తుఫాను తప్పిందని సంతోషించింది తను.

కానీ, ఈతుఫాను తిరిగి ఏరోజయినా చెలరేగవచ్చు!

ఆ మర్నాడే నాన్న తిరుపతి వెళ్లారు. వెళ్లేటప్పుడు తననడిగి వేణు వివరాలన్నీ తెలుసుకుని వెళ్ళారు.

సాయంకాలానికే తిరిగివచ్చారు నాన్న.

వేణు, నాన్నను వాళ్ళఇంటికి తీసి కెళ్లాడట.

వేణు తండ్రి ఈ సంబంధానికి ఏమాత్రం అంగీకరించలేదట.

వేణును ఫారెన్ పంపి, తిరిగి వచ్చాక, తమ బంధువుల్లోనే రెండులక్షల కట్నంతో పిల్లనిచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారట.

వేణు ఎంతవాదించినా లాభంలేక పోయిందట.

చేసేదిలేక నాన్న తిరిగి వచ్చేసారట.

ఆ ముందురోజు రావలసిన తుఫాను తన ప్రచండరూపంతో ఆరోజు వీచి, ఇంటిలోని శాంతి సంతోషాలనే వృక్షాలను సమూలంగా పెలికించి వేసింది.

తను మూగదయింది. పిచ్చిదయింది. రోగిష్టిదానిలా మంచంలోనే ఉంది కొన్నాళ్ళు.

వేణు పిరికితనంపట్ల కోపం, అసహ్యం కలిగాయి.

అంత ధైర్యం లేనివాడు తనకు ఉత్తరాలెందుకు వ్రాయాలి? ప్రేమించానని, పెళ్లిచేసుకుంటాననీ ఎందుకు చెప్పాలి? తను పూర్తిగా కోలుకుని మామూలు మనిషిగా నలుగురిలో తిరగను దాదాపు ఏ సంవత్సరం పట్టింది.

ఈ విషయం నలుగురికీ తెలియక ముందే ఏదోఒక సంబంధం కుదిరి మూడు ముళ్ళూ వేయించాలన్న నిర్ణయాని కొచ్చారు అమ్మా, నాన్నా. అలాంటి పరిస్థితుల్లో తన కర్తవ్యమేమిటో సరిగ్గా అర్థం కాలేదు. పెళ్ళి చేసుకోవడమా? మానడమా?

భావిసౌధాన్ని రంగురంగుల ఆశలతో, సుందర స్వప్నాలతో అలంకరించింది. దాని సొగసులుచూసి మురిసిపోయింది. ఆ సౌధంలో ఎప్పుడెప్పుడు ప్రవేశిద్దామా అన్న కోరికతో తహతహ లాడిపోయింది.

(52వ పేజీ చూడండి)



కానీ, అది పూర్తిగా, పునాదులతోసహా కూలిపోయింది.

వేణు పిరికితనమే ఇందుకు కారణం.

**అయితే,** తన జీవితం అప్పుడే సమాప్తమవుతుందా ? తనలోని కోరికలకు, ఆశలకు సమాధి కట్టవలసిందేనా? ఉహూ ...

క్రొత్త సౌధం నిర్మించాలన్న ఆశ ఉంది. దానికి కావలసిన శక్తి ఉంది. కోరిక ఉంది.

ఫలితంగా మనోలోకంలో, మరో సరి క్రొత్త సౌధరాజం వెలసింది. అమ్మా నాన్నల మాటవిని పెళ్ళి చూపులకు కూర్చుంది.

రెండు మూడు సంబంధాలు వచ్చినా కుదరలేదు.

చివరకు పెదనాన్న తెచ్చిన ప్రకాశం గారి సంబంధం కుదిరింది.

భవిష్యత్తనే బంగారు కొలనులో ఆశల కలువల రేకులు అందంగా విచ్చుకున్నాయి.

సుందర స్వప్నాల రాయంచలు విలాసంగా సరసులో తిరిగాయి. కోరికల అలలు సుతారంగా ఊగాయి.

మానవత్వపుమీది నమ్మకం పున్నమి వెన్నెలై తన పెళ్ళిపందిరిని శోభాయమానంగా అలరించగా పెళ్ళిపీటల మీద కూర్చుంది.

పెళ్ళిజరిగి దగ్గర దగ్గర సంవత్సరం కావస్తుంది.

కాని ఇంతలోనే ఈ వైవాహిక జీవితం కూడా సమాప్తం కాబోతుంది !

కన్నీరు తుడుచుకుని గాఢంగా నిశ్వసించింది.

ఆ క్షణానే ప్రకాశం గదిలో అడుగు పెట్టాడు.

ఆమె ముఖంలోకి అసహనంగా చూస్తూ 'ఏం? ఆఫోటో, ఉత్తరమూ తమరివేనా?' అన్నాడు.

అరవింద ముఖం మరి కాస్త క్రిందకు వంచుకుంది. కళ్ళనుండి నీరు జలజల రాలింది.

**'పాపం!** అతణ్ణే ప్రేమించి, నాతో సంసారం చేయవలసి వచ్చినందుకు విచారంగా ఉందా?' అసహ్యంగా ఆమె ముఖంలోకి చూస్తూ అన్నాడు.

అశ్రునయనాలతో అతని వేపు చూస్తూ, ది: 'క్షమించండి! ఒకప్పుడు అతణ్ణే

# ఈ సమరం సాగిస్తాను

(38 వ పేజీ తరువాయి)

ప్రేమించిన మాట నిజమే! అతను పిరికివాడు. నేనూ పిరికి దాన్నయి ఉంటే, ఆత్మహత్య చేసుకుని ఉందును...'

ప్రకాశం క్రూరంగా నవ్వుతూ, ఆమె మాటలకు అడ్డువెళ్ళి అన్నాడు.

'ఆ పని ఇప్పుడు చేయవచ్చు!'

కన్నీరు తుడుచుకుని, అతని ముఖంలోకి చూస్తూ, విషాదంగా, బరువుగా నవ్వుతూ అంది:

'ఉహూం ... నేను చాలా మొండిదాన్ని! జీవితంమీద ఇంకా ఆశ ఉంది. మానవుని మంచితనం మీద నమ్మకం ఉంది. ఈ జీవన సమరంలో పోరాడేందుకు ఇంకా చాలా శక్తి ఉంది! అప్పుడే ఈ జీవితానికి మంగళ హారతి పట్టదలచుకోలేదు '

'అయితే, ఇంకెవడో నాలాంటి తల మాసిన వాడికి వల వేయబోతున్నావన్న మాట!' అన్నాడు హేళనగా, కటువుగా.

ఆమె హృదయంలో ఉవ్వెత్తున బాధ కెరటాలు లేచాయి. బాధనంతా అణచుకుని అంది 'ప్రేమా, పెళ్ళి ఈ రెండూ ముగిసాయి. జీవితంలో ఈ రెంటికీ ఎక్కువ ప్రాముఖ్యత ఉన్నమాట వాస్తవమే. కానీ, ఇదే జీవితం కాదుగా?'

'అవును పెళ్ళయిందనిపించుకుంటే ఇంకా బాగా స్వేచ్ఛా విహారం చేయవచ్చు!' వ్యంగ్యంగా అన్నాడు. అతని ముఖంలో అసహ్యం కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. అది గమనించిన అరవింద మూగగా రోదించింది.

'మీరు పొరబడుతున్నారు. పి. యూ.సీ వరకూ చదువుకున్నాను గౌరవంగా నా పొట్ట నేను పోషించుకోగలను. ఇంతవరకూ నా కొరకు నేను జీవించాను ఇక మీదట చిన్న పిల్లల జీవితాలను తీర్చి దిద్దేందుకు నాశేష జీవితాన్ని వినియోగిస్తాను' అంది తప్త కంఠంతో

'ఎంత ఉన్నతమైన ఆదర్శం! అలాగే చేయండి, అరవిందాదేవిగారూ!' అరవింద తలెత్తి భర్త ముఖంలోకి కొద్ది క్షణాల పాటు చూసి, చూపులు వాల్చుకుంది.

ఉద్రేకానికి పూర్తిగా లోనయిన అతని మనసులో వివేచనకు స్థానంలేదని తెలుసుకున్న ఆమె ప్రస్తుతానికి మౌనం అన్ని విధాలా శ్రేయస్సనుకుంది.

నిలుచోలేక క్రింద కూలబడి, గోడకు జార్లబడింది.

కోపంతో వణకిపోతూ అక్కడే కుర్చీలో కూర్చున్నాడు ప్రకాశం.

ఐదు నిముషాలు బరువుగా జరిగిపోయాయి.

'వేణు మీకు తెలుసా?' అంది ఆ ఉత్తరమూ, ఫోటో ఎలా వచ్చాయో తెలుసుకోవాలన్న కుతుహలంతో.

'హోహో! ఇవి నాచేతికెలా వచ్చాయని సందేహంగా ఉందా? తీర్చవలసిన సందేహమే! వేణు మాకు దూరపు బంధువు. పెండ్లిలో కలుసుకున్నాము. తిరుపతి రమ్మని పట్టుబట్టాడు. వెళ్ళాను. ఆ మధ్యాహ్నం ఏంతోచక వాడిలైబ్రరీకెళ్ళి వాడు ఉందనిచెప్పిన ఒక ఇంగ్లీషు నవలకొరకు వెదకసాగాను. ఓ పుస్తకంలో నుండి ఈఫోటో, ఈ ఉత్తరమూ జారి పడ్డాయి. ఫోటో చూసాను. ఉత్తరం చదివాను. విషయమంతా అర్థమైంది. రెండూజేబులో పెట్టుకున్నాను. వాడినేమీ ప్రశ్నించలేదు. కానీ, వాడివిషయం నేను వినిఉన్నాను. నైతిక విలువలు లేనివాడు! ఇక మనిద్దరికీ కుదరదు. ఉదయాన్నే ప్రయాణానికి సిద్ధంగా ఉండు' అని అక్కడనుండి లేచి వెళ్ళిపోయాడు.

శిలా ప్రతిమలా ఉండిపోయింది అరవింద.

ఆరాత్రి ఇద్దరూ మేల్కొనే ఉన్నారు.

ఉదయాన ఆరుగంటలకు నిద్రలేచిన ప్రకాశం, మరో అరగంటకు కానీ, ఇల్లంతా చాలా నిశ్శబ్దంగా ఉన్నట్లు గమనించలేదు. లేచి అరవిందకొరకు చూచాడు.

ఇంట్లో, పెరట్లో ఎక్కడా ఆమె కనిపించలేదు.

పది నిముషాల తర్వాత హాల్లో టేబిలుమీద పేపర్‌వెయిట్ క్రింద రెపరెపలాడుతూ, అరవింద వ్రాసిపెట్టిన ఉత్తరం కనిపించింది.

'చచ్చిందా ఏమిటి?' అనుకుంటూ, ఆత్రంగా జాబుతీసి చదివాడు.

# ఈ సమరం సాగిస్తాను

శ్రీ వారికి,

నేను చెప్పాలనుకున్న విషయాలన్నీ మీ ముఖంచూస్తూ చెప్పలేక ఈ ఉత్తరం వ్రాసిపెట్టి పోతున్నాను.

ఆత్మహత్య చేసుకోమని సలహా ఇచ్చారు. కానీ అంత పిరికితనం నాలోలేదు. లేదా, అంత ధైర్యం నాకులేదు.

'అసలు ఆత్మహత్య నే నెందుకు చేసుకోవాలి?' అని మిమ్ములను ఎదురు తిరిగి ప్రశ్నిస్తే మీరేం సమాధానం చెప్తారు. నేనుచేసిన తప్పేమిటో దయచేసి చెప్తారా?

అందరిలాగే నేనూ ప్రేమించాను కానీ, నా ప్రేమ ఫలించలేదు. ప్రేమించిన ఆ గొప్పపురుషుడు చాలా పిరికివాడు! పిరికితనమంటే ఏరూపంలో ఉన్నాసరే, నాకు చెప్పలేనంత రోత! బహుశా, ఈ కారణం వల్లనే నేను మొండిగా బ్రతుకుతున్నానేమో? ఒక వ్యక్తిని ప్రేమించి మరో వ్యక్తితో కాపరం చేయడం నేనుచేసిన మరో తప్పుగా మీరు భావిస్తున్నారు కదూ?

ప్రేమించి విఫలమొందిన ప్రతి కన్య ఆత్మహత్య చేసుకోవడమో, లేదా, ఆ ప్రియుని నామం స్మరిస్తూ సజీవసమాధి కావడమో గొప్పతనమే కాని, అంతటి గొప్పతనం అందరిలోనూ ఉండదు. ముఖ్యంగా నాలాంటి సామాన్యులకు జీవవాహినిలో కొట్టుకు పోవడమే తెలుసు.

మరో విషయం మీరు బాగా గుర్తుంచుకోవలసింది —'లవ్ ఈజు కండిషన్డ్ బై లవ్' అన్న ఆర్యోక్తి. ఇది నూటికినూరుపాళ్ళ నిజం. నేనంటే లెక్కలేని వ్యక్తిని, నన్ను ప్రేమించని వ్యక్తిని ఎల్లకాలం నేను ప్రేమించలేను. చిన్న బిడ్డ సైతం ప్రేమిస్తేనే తిరిగి తన ప్రేమ నందిస్తుంది. కసరికొట్టే దూరంగా పోతుంది. ఇది మానవ ప్రకృతి.

మిమ్మలను పెళ్ళి చేసుకున్నాను. గౌరవిస్తున్నాను. మనసారా అభిమానిస్తున్నాను. మీరెంతో ఆదరంగా ప్రేమగా నన్ను చూస్తుంటే వాటికి ప్రతిస్పందించని రాతి మనసుకాదు నాది. ప్రేమాదరణలనే బీజాలు ఊరకేపోవు. అది ఎదుట వారి హృదయోద్యానంలో మొలకెత్తి, చిగురించి, పుష్పిస్తాయి. ఇది ప్రకృతి సత్యం.

వేణుకు నాకు మధ్యనున్న సంబంధం గురించి మీకు చాలా అనుమానాలున్నాయి మీ ఉద్దేశాలను నేను మార్చలేను, కానీ, ఒక నిర్ణయానికి వచ్చేముందు బాగా ఆలోచించమని మిమ్మలను మరీమరీ ప్రార్థిస్తున్నాను. ఈ తప్పే మీరు చేసినట్లయితే ఇది తప్పనిపించుకుంటుందా ?

ప్రస్తుతం నీరజ దగ్గరకు వెళ్తున్నాను. తను కాళహస్తిలో టీచర్‌గా పని చేస్తుంది. నా కాళ్ళమీద నేను నిలుచుకునే వరకు తన సహాయం తీసుకోకతప్పదు. నా సంసారాన్ని నా చేతులతో కూల్చదోసుకునేటంతటి అవివేకిని కాను. నా తప్పేమీ లేదని మీకనిపిస్తే, తిరిగి వచ్చేందుకు నాకెలాంటి అభ్యంతరమూలేదు. 'నేను స్వీకరించని పక్షంలో ఏం చేస్తుందో?' అన్న సందేహం మీకు కలగవచ్చు. ఈ జీవిత సమరాన్ని చివరి శ్వాస తీసుకున్నంత వరకు సాగిస్తాను.

ఉంటాను,

నా తప్పు లన్నింటినీ క్షమించమని


కోరుతూ —

అరవింద'

నాలుగుసార్లు చదివాడా ఉత్తరాన్ని. మనసంతా బరువుగా తయారైంది. గాఢంగా నిట్టూర్చి, వాలు కుర్చీలో కూర్చుని బరువుగా కళ్ళు మూసుకున్నాడు. చాలాసేపు ఆలోచించాక 'నేను త్వరపడ్డానా!' అన్న ప్రశ్న కలిగింది ప్రకాశానికి! ●


## కళ్ళక్రింద నల్లని మచ్చలూ, ముడతలూ... మీ అందానికి ఎంతటి లోపాన్ని కలిగిస్తాయి?

వాటిని పోగొట్టేందుకు ఒక్కసారి ప్రయత్నించరా?



ల్యూర్ అయ్‌క్రీమ్ కళ్ళక్రింద నల్లని మచ్చలను, ముడతలను, గతుకులను తొలగిస్తుంది. మిమ్మ తక్కువ వయస్సు వారిలా కనబడేలా చేస్తుంది. ల్యూర్—చర్మములోకి చొచ్చుకొనిపోయి, చర్మమును



ఆక్సిజనేట్ చేసి చర్మాణువులకు తిరిగి శక్తినిచ్చి, తిరిగి యవ్వన సౌందర్యమును సమకూర్చుతుంది. ప్రజలు మొదట మీ కళ్ళను చూస్తారు. ల్యూర్ వాటిని చూచుటకు ఆకర్షణీయంగా చేస్తుంది.




డిస్ట్రిబ్యూటర్లు, దక్షిణ భారతంలో:, టి. టి. కృష్ణమాచారి అండ్ కంపెని